ఎప్పటికైనా కూల్చివేత తప్పదు!

- తరలించేందుకు డెడ్‌లైన్ లేదు
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పర్మిషన్లు వ్యాలీడ్
- రెండు నెలల్లో మూసీ పనులు
- మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : 'రెండు నెలల క్రితం డ్రోన్ సర్వే చేయగా మూసీ నది బఫర్‌జోన్‌లో 10,660 నివాసాలున్నట్టు గుర్తించాం.. వీళ్లందర్నీ 14 ప్రాంతాలకు తరలించి పునరావసం కల్పిస్తున్నాం. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామంటే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే 50 కుటుంబాలను తరలించాం. విద్యార్థులకు స్కూల్ సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నాం.. ప్రభుత్వం కూలగొట్టాలనుకుంటే ఎప్పుడో కూలగొట్టేది..కానీ వారి అంగీకారం తర్వాతే కూలగొడుతున్నం. అందర్నీ సమ్మతితో తరలించడమే డెడ్‌లైన్..ఎప్పటికైనా కూల్చివేతలు తప్పవు' అని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ దాన కిశోర్ స్పష్టంచేశారు. మూసీ సుందరీకరణ, ప్రజల తరలింపు అంశాలపై సచివాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూసీ నదిలో మంచినీళ్లు పారించి.. నగరానికి జీవనదిగా మార్చడమే సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని, ఇందులో భాగంగానే రూ.10 వేల కోట్లతో రెండు నెలల్లో మూసీ సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పునరావాసానికి సరిపడా ఇండ్లు లేవు

మూసీ పరీవాహకం నుంచి తరలించే వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తున్నామని చెప్తున్న దాన కిశోర్.. మరోవైపు అవసరమైన ఇండ్లు లేవని తెలిపారు. బాధితులు 10వేలకు పైగా ఉంటే నాలుగైదు వేల ఇండ్లే ఉన్నాయని చెప్పారు. 15వేల ఇండ్ల నిర్మాణానికి అనుమతి తీసుకున్నామని, రూ.700 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు.

జీహెచ్ఎంసీ,హెచ్ఎండీఏ అనుమతులు..

ఇండ్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఇచ్చిన అనుమతులు కచ్చితంగా వ్యాలిడ్ అవుతాయని దానకిశోర్ స్పష్టం చేశారు. అక్కడక్కడా తప్పులు జరుగుతాయని, అయినా ఆ అనుమతులను గౌరవించాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. కొన్ని తప్పిదాల వల్ల బఫర్, ఎఫ్‌టీఎల్‌లోనూ ఇండ్ల నిర్మాణానికి అనుమతులిచ్చారని, వీటిపై ఏం చేయాలనేది ప్రభుత్వం చర్చిస్తున్నదని తెలిపారు. ఇకపై అనుమతుల్లో తప్పిదాలు జరగకుండా టీజీ బీపాస్‌లో కెమెరాతో ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించే అధునాతన సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు వివరించారు.

వెబ్‌సైట్లో బఫర్, ఎఫ్‌టీఎల్ వివరాలు

హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో అసలు నగరంలోని చెరువుల పరిధిపై స్పష్టత ఉన్నదా? అని విలేకరులు అడిగిన ప్రశ్నపై స్పందించిన దాన కిశోర్.. ఓఆర్ఆర్ లోపల 560 చెరువులు ఉంటే వీటిలో 503 చెరువుల బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధి గుర్తిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. ఓఆర్ఆర్ బయట 2,693 చెరువులు ఉంటే వీటిలో 2,052 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. వీటి వివరాలన్నీ వెబ్‌సైట్లో పొందుపరుస్తామని తెలిపారు.

పట్టా భూములకు డబుల్ పరిహారం..

పట్టా భూములు ఉన్నవారికి మార్కెట్ వాల్యూకు రెట్టింపు పరిహారం ఇస్తామని, బహుళ అంతస్థుల కట్టడాలుంటే ఆ విలువ కూడా చెల్లిస్తామని, ఉమ్మడి కుటుంబాలు ఉన్నవారికి వేర్వేరుగా పరిహారం ఇచ్చే అంశంపై చర్చిస్తున్నామని దానకిశోర్ తెలిపారు. ఎంజీబీఎస్ వద్ద మూసీలోనే ఉన్న మెట్రో దారిపై ఫిర్యాదు వచ్చిందని, దీనిపై ప్రభుత్వం చర్చిస్తున్నన్నట్టు తెలిపారు.

అనుమతులను గౌరవిస్తం.. రద్దు చేసి కూల్చేస్తం

- ఒకే వేదికపై ఇద్దరు అధికారుల విరుద్ధ ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : హైడ్రా కూల్చివేతలకు సంబంధించి మున్సిపల్ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లది కీలక పాత్ర! ఈ ఇద్దరు ఒకే అంశంపై విభిన్న అభిప్రాయాలు కలిగి ఉండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇద్దరూ ఒకే వేదికపై ఒకే అంశంపై విరుద్ధ ప్రకటనలు చేయడం గందరగోళానికి గురిచేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఇంటి నిర్మాణానికి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఇచ్చిన అనుమతులను గౌరవించాల్సిందేనని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ చెబితే.. కాదు కాదు ఆ అనుమతులను రద్దు చేయించి మరీ కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పడం గమనార్హం. శనివారం సచివాలయంలో మూసీ సుందరీకరణ కోసం బాధితుల తరలింపు, హైడ్రా కూల్చివేతలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఇంటి నిర్మాణాల అనుమతులు, కూల్చివేతలపై విరుద్ధ ప్రకటనలు చేశారు. తొలుత జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు గల ఇండ్లను కూల్చివేయడం లేదని చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆ తర్వాత అనుమతులను రద్దు చేయించి మరీ కూల్చివేస్తామని ప్రకటించడం గమనార్హం. ఆ తర్వాత మాట్లాడిన దానకిశోర్.. అక్కడక్కడా తప్పిదాలు జరుగుతాయని ఒప్పుకొంటూనే ఆ అనుమతులను గౌరవించాల్సిందేనని, ఈ అంశంపై ఏం చేయాలనేదానిపై ప్రభుత్వం చర్చిస్తున్నట్టుగా తెలిపారు. ఇలా కీలక అంశంపై కీలక అధికారులు విరుద్ధ ప్రకటనలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా విధివిధానాలపై కీలక అధికారులకే స్పష్టత లేకుంటే కిందిస్థాయి అధికారుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హైడ్రా బూచి కాదు.. భరోసా

- అక్రమ నిర్మాణాలనే కూలగొడుతున్నం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతి ఉన్న, ప్రజలు నివసిస్తున్న ఇండ్లను కూల్చడం లేదు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలకు నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్/సిటీబ్యూరో సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'పేదవాళ్లను, చిన్న వాళ్ల నుబాధపెట్టే ఉద్దేశం హైడ్రాకు లేదు.. హైడ్రా నుబూచిగా చూపుతున్నారు.. హైడ్రా ఒక భరోసా, బాధ్యత' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంచేశారు. కూల్చివేతల్లో ఉన్న వారంతా పేదలు కాదని, ఆక్రమణలకు పాల్పడిన వారే ఉన్నారని చెప్పారు. చెరువులో ఇండ్లు కట్టుకోవడం ఎవరికీ హక్కుకాదని.. అర్హతలు లేనివారు పర్మిషన్లిస్తే ఎలా చెల్లుతాయని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలను మాత్రమే హైడ్రా కూల్చివేస్తున్నదని, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీ అనుమతులు ఉన్నవాటిని కూల్చడం లేదని, ప్రజలు నివాసం ఉండే ఇండ్లను కూడా కూల్చడం లేదని తెలిపారు. కూల్చివేతలకు సంబంధించి ముందే సమాచారం ఇస్తున్నామని, ఒకవేళ ఖాళీ చేయకుంటే మరింత సమయం ఇస్తున్నామని చెప్పారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రాకు సంబంధించిన పలు విషయాలను వివరించారు. హైడ్రాపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు.ఇండ్లు, స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు కనీసం ఎంక్వైరీ చేయడం లేదని, రుణాలు ఇచ్చేముందు బ్యాంకులు కూడా విధులు సరిగ్గా నిర్వర్తించడం లేదన్నారు.

వాటి కూల్చివేతకు నోటీసులు అనవసరం

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చేందుకు నోటీసులు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని, కానీ, తాము పేదలను దృష్టిలో పెట్టుకొని నోటీసులు జారీ చేస్తున్నామని రంగనాథ్ తెలిపారు. కొందరు నిర్లక్ష్యంగా ఉంటూ ఖాళీ చేయడం లేదని, అలాంటి వారికి మళ్లీ సమయం ఇస్తున్నామని తెలిపారు. కొన్ని సందర్భాల్లో ల్యాండ్ ఓనర్‌కు నోటీసులు ఇస్తున్నామని, కానీ వాళ్లు మాత్రం కిరాయి ఉండే వాళ్లకు సమాచారం ఇవ్వడం లేదని వివరించారు.

పర్మిషన్ క్యాన్సిల్ చేసి కూల్చేస్తాం..

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీల నుంచి పర్మిషన్ ఉన్న నిర్మాణాలను కూల్చబోమని చెప్పిన రంగనాథ్.. ఒకవేళ అవి బఫర్, ఎఫ్‌టీఎల్‌లో ఉంటే పర్మిషన్ క్యాన్సిల్ చేయించి కూల్చివేస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటివరకు కూల్చిన కట్టడాలన్నీ పర్మిషన్ లేనివేనని తెలిపారు. ఒకవేళ ఉన్నా అవి సంవత్సరాల క్రితమే కోర్టుల ద్వారా క్యాన్సిల్ అయ్యాయని, కానీ యజమానులు మాత్రం అనుమతి ఉన్నదనే అనుకుంటున్నారని తెలిపారు.

పెద్దవాళ్లే మా ఫస్ట్ టార్గెట్

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పెద్దవాళ్ల కట్టడాలను కూల్చకుండా పేదలవి కూల్చడం ఏమిటని విలేకరులు ప్రశ్నించగా.. కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ తమ ప్రథమ టార్గెట్ పెద్దవాళ్లేనని, తాము సైలెంట్‌గా లేమని, గ్రౌండ్ వర్క్ చేస్తున్నామని తెలిపారు. ఎప్పుడో ఓసారి కూల్చివేతలు మొదలుపెడతామని చెప్పారు.

జన్వాడ ఫాంహౌస్ మా పరిధిలో లేదు..

జన్వాడ్ ఫాంహౌస్‌ను ఎప్పుడు కూల్చుతున్నారంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ.. అది తమ పరిధిలో లేదని, జీవో 111 పరిధిలోకి వస్తుందని తెలిపారు.

అకడమిక్ ఇయర్ పూర్తయ్యాక కూల్చివేత

ఓవైసీ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి ఇలా చాలా మంది కాలేజీలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయంటూ తమకు చాలా ఫిర్యాదులు వచ్చినట్టు రంగనాథ్ తెలిపారు. వీటి కూల్చివేతలపై వెనుకంజ వేయలేదని, విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నప్పుడు కాలేజీలను కూల్చితే వేలాది మంది విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని, వాళ్లంతా రోడ్లపైకి వస్తారని అందుకే విద్యా సంవత్సరం పూర్తి కాగానే కూల్చివేస్తామని తెలిపారు.

భయంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య..

బుచ్చమ్మ ఆత్మహత్య చాలా బాధ కలిగించిందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాపై జరుగుతున్న ప్రచారంతో భయాందోళనకు గురై ఆమె ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. కూకట్‌పల్లి చెరువు పరిధిలో బుచ్చమ్మకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, ఇద్దరు కూతుళ్లకు జీ+1 బిల్డింగ్ ఇవ్వగా మరో కూతురుకు ఓపెన్ ప్లాట్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కట్టడాలు బఫర్ జోన్‌లో ఉన్నా వాటి జోలికి హైడ్రా పోలేదని చెప్పారు. హైడ్రా కూల్చివేస్తదంటూ ప్రచారం జరగడంతో భయపడిన బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నదని, పేదలను భయపెట్టే ఉద్దేశం హైడ్రాకు లేదని పేర్కొన్నారు.

దెబ్బకు దయ్యం వదిలింది!

- హైడ్రా ఒంటెత్తు పోకడ
- కార్యాలయాలకి వెళ్లిన జర్నలిస్టులకు బెదిరింపులు
- ప్రజాగ్రహం, బుచ్చమ్మ ఆత్మహత్యతో వదిలిన మత్తు
- హడావుడిగా మీడియా సమావేశం
- పాత్రికేయుల ప్రశ్నలకు గంటలపాటు వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్28 (నమస్తే తెలంగాణ): చెరువులు, నాలాల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా.. ఎలాంటి చట్టబద్ధత లేకున్నా ప్రభుత్వం దన్నుతో కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో పేదల నివాసాలపై విరుచుకుపడుతున్నది. విక్రయదారులను, రిజిస్ట్రేషన్ చేసిన, నిర్మాణ అనుమతులను మంజూరు చేసిన అధ్యోగులను విడిచిపెట్టి ఆక్రమణల పేరిట పేదలపై కన్నెర్ర చేస్తూ వస్తున్నది.పెద్దల బంగ్లాలను విడిచిపెడుతూ, పేదల గుడిసెలను కూలగొడుతున్నది. ఈ అంశంపై కమిషనర్ రంగనాథ్ తీరుపై, హైడ్రా చర్యలపై ఆదినుంచీ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చర్యలను ప్రశ్నించిన మీడియాను పక్కనపెట్టింది. కేవలం అనుకూల మీడియా ముందు ప్రత్యక్షమవడం, కూల్చివేతలకు సమర్థింపుగా ప్రకటనలు ఇచ్చేందుకే పరిమితమైంది. బాధితుల గోడును మాత్రం పట్టించుకున్న దాఖలాలేదు. వారి తరపున ఇదేమని అడిగిన మీడియాకు హైడ్రా అధికారులు ముఖం చాటేసుకొని తిరిగారు. ఒకానొక సందర్భంలో కార్యాలయానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై బెదిరింపులకు దిగారంటే హైడ్రా పోకడలను అర్థం చేసుకోవచ్చు. అదే దుందుడుకుతనంతో తాజాగా మూసీ పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలకు మార్కింగ్ చేయడం, స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడం, ఎక్కడ గూడు చెదిరిపోతుందోనని మనోవేదనతో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకోవడంతో ఎట్టకేలకు అధికారగణానికి పట్టిన దయ్యం వదిలింది. ఇంతకాలం దూరం పెట్టిన మీడియా ప్రతినిధులను హుటాహుటినా పిలిచి మరీ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశం నిర్వహించారు. కూల్చివేతలు, జరిగిన ఘటనలను సమర్థించుకునే ప్రయత్నం చేశారు. దాదాపు గంటన్నరకు పైగా పాత్రికేయులతో భేటీ అయి, అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మొత్తంగా ప్రజాప్రతిఘటన, బుచ్చమ్మ మరణంతో హైడ్రాకు కనువిప్పు కలిగిందని చర్చించుకుంటున్నారు.

రిపోర్టర్‌పై ఐలాపూర్ వాసుల దాడి

- హైడ్రాపేరుతో బెదిరింపులు
- స్తంభానికి కట్టేసి చితకబాదిన స్థానికులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 28 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ తండాలో శనివారం రాత్రి ఓ విలేకరిని చితకబాదారు. స్థానికుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన జనం సాక్షి పత్రిక విలేకరి సంతోష్ ఐలాపూర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలుసుకొని అక్కడి వెళ్లాడు. అక్కడి నాయకులు ముఖీం, అజీంతోపాటు స్థానికులు సదరు రిపోర్టర్‌ను స్తంభానికి కట్టేసి చితకబాదారు. నిత్యం బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో సహనం కోల్పోయి ఈ చర్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. విలువైన ప్లాట్లతోపాటు లక్షలు ఇచ్చినట్టు వారు చెప్పారు. అయినప్పటికీ హైడ్రాఅధికారులతో మాట్లాడి ఇక్కడ నిర్మిస్తున్న ఇండ్లను కూల్చివేయిస్తానని బెదిరించడంతో పాటు తాగిన మైకంలో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో దాడి చేశామని తెలిపారు. స్థానిక నాయకుడు ముఖీం అమీన్‌పూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

విలేకరిని స్తంభానికి కట్టి చితకబాదుతున్న ఐలాపూర్ వాసులు

Blue Square: Pearl Moto, Kondapur, Ph: 7669400333; **Ashoka Automotives,** LB Nagar, Ph: 9248046090; **Hot Wheels, Madeenaguda,** Ph: 8982988982; **Vasudha Automobiles, Himayat Nagar,** Ph: 9866781234; **Omega Moto, Moosarambagh,** Ph: 9000000830; **Arjun Auto, Kompally,** Ph: 8886608618; **Hyd Auto Forte, Attapur,** Ph: 7330730606; **Raghavendra Motors, RC Puram,** Ph: 8886620108; **Branch: Venkatesha Motors, Erragadda,** Ph: 9032000745; **Ashoka Motors, Uppal,** Ph: 9248046099; **Marvel Bikes, Tadbund,** Ph: 8886655519; **Authorized Main Dealership: Venkatesha Motors, Somajiguda,** Ph: 9052288129; **Ashoka Motors, Mettuguda,** Ph: 9248046065; **Marvel Bikes, Tirumalagiri,** Ph: 8886655511; **Vasudha Automobiles, AS RAO Nagar,** Ph: 7997990139; **Pearl Moto, Kukatpally,** Ph: 7669400333; **Ashoka Motors, Ranigunj,** Ph: 9248046068; **Branch: Pearl Moto, Tolichowki,** Ph: 7669400333; **Venkatesha Motors, Lakdikapool,** Ph: 9032000744; **Yamaha Bike Corner, Suraram Colony,** Ph: 7669400333; **Jagathgirigutta,** Ph: 7669400333; **Manikonda,** Ph: 7669400333; **Nagaram,** Ph: 9866781234; **Medak,** Ph: 9676111306; **Shankerpally,** Ph: 7669400333; **Medchal,** Ph: 8886608621; **Siddipet,** Ph: 9666160160; **Sangareddy,** Ph: 8886620108; **Balapur,** Ph: 9849130864.